# వైయస్ఆర్ కాంగ్రెస్
e-paper

కూర్పు: వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ | 29 జనవరి, ఆదివారం 2017 - హైదరాబాద్ | సంపుటి: 1 సంచిక: 718 పేజీలు : 4


అవినీతి

అసమర్థ

అసత్యం

అప్రజాస్వామ్యం



# చతుర్ముఖ దుష్టపరిపాలన



ప్రజలకు అభివాదం చేస్తున్న వైయస్ జగన్

## - వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి

- దేశంలో ఏపీని అవినీతిలో నెంబర్ వన్ చేశారు
- బాబు వ్యవస్థలను, మీడియాను మేనేజ్ చేసుకొని ప్రజలను మోసం చేస్తున్నాడు
- ఇలాంటి సీఎంను ఎప్పుడైనా చూశామా?
- రాజధాని ప్రాంతంలో మంత్రులు, బాబు బినామీలు భూములు కొనుగోలు చేశారు
- ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో నీళ్లు రావడం లేదు..బాబు అవినీతి పొంగిపోర్లుతోంది
- మద్యం షాపులు, బొగ్గు కొనుగోళ్లు అన్నింటా అవినీతిమయమే
- రెండున్నరేళ్లు కావవస్తున్నా ట్రైబల్ అడ్వైజరీ కమిటీ వేయలేదు
- ఎమ్మెల్యేలకు విలువలేకుండా చేస్తున్నాడు
- పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ప్రజల్లోకి వెళ్లే ధైర్యం లేదు
- గాంధేయ పద్ధతిలో ప్రదర్శన చేయకుండా అడ్డుకున్నారు
- చంద్రబాబు అప్రజాస్వామిక పాలన పోవాలి
- గ్రామస్థాయి నుంచి ప్రతి ఒక్కరూ హోదా ఉద్యమంలోకి రావాలి
- ఉప్పొంగిన పశ్చిమ గోదావరి జిల్లా
- కోటగిరి శ్రీధర్ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరిక
- ద్వారకా తిరుమల బహిరంగ సభకు పోటెత్తిన ప్రజలు

మిగతా.. 2, 3 పేజీల్లో

# చతుర్ముఖ దుష్టపరిపాలన

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతున్న పాలన తీరుపై వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ప్రతిపక్ష నేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి నిప్పులు చెరిగారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అవినీతి, అసత్యాలు, అసమర్థ, అప్రజాస్వామిక పాలన కలుపుకొని చతుర్ముఖ దుష్టపరిపాలన సాగుతుందని మండిపడ్డారు. ఒక్కొ అంశంపై ఆయన విపులంగా వివరిస్తూ సర్కార్‌పై దుమ్మెత్తిపోశారు. ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకా తిరుమలలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది ప్రజలు హాజరయ్యారు. ప్రత్యేక హోదా నినాదం ఢిల్లీకి వినిపించేలా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన మాజీ మంత్రి స్వర్గీయ కోటగిరి విద్యాధరరావు కుమారుడు కోటగిరి శ్రీధర్‌తో పాటు పలువురు టీడీపీ నేతలు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి వైయస్ జగన్ కండువాలు వేసి పార్టీలోకి సాదారంగా ఆహ్వానించారు. ద్వారకా తిరుమల బహిరంగ సభలో వైయస్ జగన్ ఏమన్నారంటే..ఆయన మాటల్లోనే..

*– పశ్చిమ గోదావరి*



ఇవాళ ద్వారకా తిరుమల అనగా..చిన్న తిరుపతి అంటారు. వెంకటేశ్వరస్వామి సన్నిధిలో మన పార్టీలోకి శ్రీధర్‌ను ఆహ్వానిస్తున్నాను. శ్రీధర్ యువకుడు, ఉత్సాహవంతుడు. మంచి చేస్తాడని నాకు కూడా నమ్మకం ఉంది. ఇవాళ రాష్ట్రంలో ఒక్కసారి తిరిగి చూస్తే.. చంద్రబాబుపాలన కనిపిస్తోంది. ఒక్కసారి ఆ పరిపాలన గురించి ఆలోచన చేసినప్పుడు మనందరికి ఒక్కటి అర్థమవుతుంది. ఎవరైనా ఓటు వేయాలంటే..అభివృద్ధి ఏంటని ఒక్కసారి ఆలోచిస్తారు. నిన్నటి కన్న ఇవాళ మనం బాగుంటే..ఇవాల్టి కన్నా రేపు బాగుంటామని భావిస్తే అప్పుడు అభివృద్ధి జరిగిందని గొప్పగా చెబుతాం. ఇవాళ బాబు పాలనలో అవినీతి జరుగుతుంది. అసమర్థ పాలన జరుగుతుంది. అసత్యాల పాలన జరుగుతోంది. అప్రజాస్వామిక పాలన సాగుతోంది. వీటన్నింటిని కలిపి చతుర్ముఖ దుష్టపరిపాలన జరుగుతోంది. ఒక్కసారి బాబు పాలన గురించి మాట్లాడాల్సి వస్తే..మొట్ట మొదట చెప్పాలంటే అవినీతి పాలన..

## అవినీతి పాలన

రాష్ట్ర పరిపాలనపై ఇటీవల ఎన్‌సీఏఈఆర్ ఓ రిపోర్టు ఇచ్చింది. ఆ రిపోర్టు ఏంటో తెలుసా..దేశంలో మన ఏపీ అవినీతిలో నంబర్‌వన్‌లో ఉందని నివేదికలు ఇచ్చారు. బాబు పాలన ఇవాళ కేవలం వ్యవస్థలను మ్యానేజ్ చేసుకోవడం, అనుకూలంగా ఉన్న మీడియాను మ్యానేజ్ చేయడం, ప్రజలను మోసం చేయడం జరుగుతోంది. అవినీతి అన్నది ఇవాళ ఎలా జరుగుతుందే..దేశంలో ఇంతమంది సీఎంలు ఉన్నారు. ఎప్పుడైనా మనకు అనిపించిందా. ఒక ముఖ్యమంత్రి నల్లధనంతో ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం, ఆ సమయంలో ఆయన ఖర్మ బాగోలేక ఆడియో, వీడియో టేపులతో దొరికిపోవడం, ఆ తరువాత కూడా ఆ సీఎం రాజీనామా చేయకపోవడం, జైలుకు పోకపోవడం ఎక్కడైనా చూశామా? ఎక్కడా లేదు. మన రాష్ట్రంలోనే, అది కూడా బాబు కాబట్టే అలా జరుగుతోంది. రాజధాని భూముల్లో ఇన్‌సైడర్ ట్రేడింగ్ చేస్తారు. అయినా ఆయన మీదా యాక్షన్ తీసుకోరు. రాజధాని ఇక్కడ కాదు..అక్కడెక్కడో అంటూ నూజీవీడు అన్నారు. అసలైన రాజధాని వచ్చే ప్రాంతంలో తన బినామీలతో తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసిన తరువాత ఎనిమిది నెలలకు రాజధాని అక్కడ కాదు..ఇక్కడ అని డిక్లెర్ చేస్తారు. రైతులందరు నష్టపోయారు. కానీ బాబు, తన బినామీలు గొప్పగా సంపాదించుకున్నారు. స్విస్ చాలెంజ్ పేరుతో తనకు నచ్చిన సింగపూర్ కంపెనీలకు వేల ఎకరాలు ఇచ్చేస్తున్నారు. రైతుల భూములను ధారాదత్తం చేస్తున్నారు. బాబు పాలనలో ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో నీళ్లు రావడం లేదు. అవినీతి ఏరులై పారుతోంది. కాంట్రాక్టర్లకు దోచిపెట్టేందుకు ప్రత్యేక జీవోలు తీసుకొని వస్తారు. డబ్బులివ్వాల్సిన పనిలేకపోయినా కమీషన్లు మాట్లాడుకొని అంచనాలు పెంచుతూ చెక్కులిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు అంచనా వేయం రూ.16 వేల కోట్ల నుంచి రూ.40 వేల కోట్లు చేశారు. ఈ రెండున్నరేళ్లలో పెట్రోలు, డిజిల్ ధరలు తగ్గాయి, సిమెంట్, ఇసుక ధరలు తగ్గాయి. దీంతో తనకు రావాల్సిన కమీషన్లు రాకపోతాయని తెలిసి అన్యాయమైన కాంట్రాక్టర్‌ను కొనసాగిస్తాడు. తనకు నచ్చిన వారికి సబ్ కాంట్రాక్టులు ఇస్తున్నారు. మద్యం నుంచి బొగ్గు వరకు, గుడి భూములను కూడా బాబు వదిలిపెట్టడం లేదు. సదావర్తి భూములను వెయ్యి కోట్ల ధర పలికే వాటిని రూ.22 కోట్లకు ఇచ్చే సన్నహాలు చేస్తున్నారు. విజయవాడ నడిబొడ్డున ఉన్న కనకదుర్గమ్మ భూములను కూడా కారుచౌకగా ఇచ్చేస్తున్నారు. రాజధానిలో తాత్కాలిక భవనాలు, సెక్రటరేట్ అంటాడు. ఇళ్లు కట్టడానికి అడుగు రూ.1500 అవుతుంది. కానీ సెక్రటరేట్ కట్టడానికి రూ.10 వేలు ఖర్చు చేస్తున్నాడు. ఫైర్ బ్రిడ్, ఎర్రచందనం పేరుతో దోచుకుంటున్నాడు. ఏ ఊర్లోకూడా ప్రభుత్వ పని చేయాలంటే నామినేషన్ పద్ధతి అప్పగిస్తున్నారు. గ్రామ స్థాయి నుంచి ఎమ్మెల్యేలు, జిల్లా స్థాయిలో మంత్రులు, రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రే దొంగతనం చేస్తున్నారు. కన్సల్‌టెంట్ల పేరుతో దోచుకుంటున్నారు. రాజధాని భూమి పూజ కోసం వందల కోట్లు, గోదావరి, కృష్ణ పుష్కరాలకు రూ.3 వేల కోట్లు స్వాహా చేశారు. మూడు రోజుల పాటు సైన్స్ ఫెస్టివల్ అంటాడు రూ.200 కోట్లు ఖర్చు చేస్తాడు. ఎక్కడికైనా వెళ్లాలంటే ప్రైవేట్ విమానాల్లో వెళ్తున్నాడు. సింగపూర్, దుబాయ్, స్విడ్జర్‌ల్యాండ్ వెళ్తాడు. మోడీ మొట్టికాయలు వేస్తాడని భయముంది. తెల్ల చర్మం వద్దంటాడు..తెల్ల జుట్టు ముద్దంటాడు.



శ్రీధర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైయస్ జగన్

## అసమర్థ పాలన

ఎంత దారుణంగా అసమర్థ పాలన జరుగుతుందటే..రైతులకు పంట రుణాలు రూ.48 వేల కోట్లు ఇవ్వాలని బ్యాంకర్లు టార్గెట్లు పెట్టుకున్నారు. రబీలో రూ.36 వేల కోట్లు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇచ్చింది కేవలం రూ. 5వేల కోట్లు మాత్రమే. బ్యాంకర్లను అడిగే దమ్ము ధైర్యం బాబుకు లేదు. రాష్ట్రంలో పంటల సాగు సాధ్యం కావడం లేదు. రైతులకు మేలు చేయడం మరిచి, రైతుల భూములు ఎలా లాక్కోవాలో ఆలోచిస్తారు. అసమర్థ పాలన అంటే ఏంటో తెలుసు..కేసీఆర్‌ను నిలదీస్తే బొక్కలో పెడతారని భయపడి..పక్క రాష్ట్రంలో కేసీఆర్ కృష్ణ, గోదావరి జలాలను పంపులు పెట్టి తీసుకెళ్తున్నా పట్టించుకోవడం లేదు. పార్లమెంట్‌ను సాక్షిగా చేస్తూ ప్రతిపక్షం, అధికార పక్షం ఒక్కటై రాష్ట్రాన్ని విడగొట్టే సమయంలో ప్రత్యేక హోదా ఇస్తామని మాటిచ్చారు. ఇప్పుడు ఎందుకు ఇవ్వడం లేదని అడిగే దమ్మూ, ధైర్యం బాబుకు లేదు. గట్టిగా మోడీని అడిగితే ఎక్కడా సీబీఐ విచారణ చేయిస్తారోనని బాబుకు భయం. ఇవాళ ఏపీని విడగొట్టే సమయంలో విభజన చట్టంలో మనకు దుగ్గరాజుపట్నం ఏయిర్‌పోర్టు, కడపలో ఉక్కుపరిశ్రమ, విశాఖకు రైల్వే జోన్ ఇస్తామన్నారు. పోలవరం మేమే కడుతామని హామీ ఇచ్చారు. ఇవాళ గొప్పగా ఇచ్చారని దానికి ప్యాకేజీ అని కలర్ ఇచ్చి ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టారు. ఇదే జిల్లాలో ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు ఎంఆర్‌వోను జుట్టుపట్టుకొని లాక్కొచ్చిన చంద్రబాబు చర్యలు తీసుకోడు. ఇదే జిల్లాలో విద్యార్థినులు కొద్ది రోజుల క్రితం ఆత్మహత్యలు చేసుకున్నారు. అందుకు టీడీపీ ఎమ్మెల్యేల ప్రమేయం ఉందని తెలుసు. అయినా వారిపై చర్యలు తీసుకోవడం లేదు. ఆరోగ్యశ్రీ పూర్తిగా పడకేసింది. పూర్వం రోజుల్లో 108 నంబర్ కొడితే కుయ్..కుయ్ మంటూ 20 నిమిషాల్లో అంబులెన్స్ వచ్చేది. పెద్ద ఆసుపత్రుల్లో ఆపరేషన్లు ఉచితంగా చేయించి చిరునవ్వుతో ఇంటికి పంపించే వారు. ఇవాళ అంబులెన్స్ ఎప్పుడు వస్తోందో తెలియడం లేదు. ఆరోగ్యశ్రీ బకాయిలు ఇవ్వడం లేదని డాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీపీ, షుగర్ పేషెంట్లకు మందులు అందడం లేదు. 104 ఉద్యోగులకు వేతనాలు ఇవ్వడం లేదు. ఆరోగ్యశ్రీని నడపలేని అసమర్థ పాలన నడపలేని సర్కార్‌ను చూస్తున్నాం. ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడం లేదు. బీసీలకు ప్రేముందని బాబు డబ్బాలు కొట్టుకుంటున్నారు. బీసీలపై దివంగత నేత వైయస్ఆర్ చూపించారు. పేదవాడు పేదరికం నుంచి బయటకు రావాలంటే పేదవాడి కొడుకు డాక్టర్, ఇంజనీరు కావాలి. నీవు ఉన్నత చదువులు చదువుతావా? నేను చదవిస్తానని వైయస్ఆర్ ఫీజు రీయింబర్స్‌మెంట్ పేరుతో చదివించారు. ఇవాళ ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ముష్టి వేసినట్లు రూ.30 వేలు ఇస్తున్నాడు. ఇవాళ పేదవాడు చదవలేని పరిస్థితి నెలకొంది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నడపలేని సర్కార్ ఇది. రైతులకు నీళ్లు అందాలని వైయస్ఆర్ పాలనలో 80 శాతం ప్రాజెక్టు పనులు పూర్తి చేశారు. మిగతా 20 శాతం పనులు పూర్తి చేయడం లేదు. మూడేళ్లు అయిపోవస్తోంది. ఇంతవరకు గ్రామంలో ఒక్క ఇల్లు కూడా కట్టించిన పాపాన పోలేదు. వైయస్ఆర్ సువర్ణయుగంలో దేశంతో పోటిపడి 48 లక్షల ఇల్లు కట్టించారు. అసమర్థపాలన అంటే వైయస్ఆర్ చేసిన పాలనను మళ్లి ఇవ్వలేకపోవడమే.

## అసత్యాలు, అబద్ధాల పాలన

బాబుకు ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజలు గుర్తుకు వస్తారు. ఓట్లు వేయించుకునేందుకు మాత్రమే ప్రజలు పనికివస్తారు. ఆ సమయంలో బాబు నోట్లో ఎలాంటి మాటలోస్తాయే. టీవీల్లో ఎలాంటి ప్రచారం చేస్తారంటే...రైతు రుణాలు మాఫీ కావాలంటే బాబు సీఎం కావాలన్నారు. రైతు రుణాలు మాఫీ అయ్యాయా? అబద్ధాలు ఆడుతాడు, అసత్యాలు చెబుతారు. రైతులను వదిలిపెట్టడు, అక్క చెల్లెమ్మలను వదిలిపెట్టడు. పొదుపు సంఘాలను నేనే స్థాపించానని చెబుతాడు. ఇవాళ నేను అడుగుతున్నా..మన ఇళ్లలో అక్క చెల్లెమ్మలు ఉన్నారు. అందరికి వాళ్లు పడుతున్నా బాధలు తెలుసు..వారి రుణాలు మాఫీ అయ్యాయా? , బాబు గెలవడానికి చిన్నపిల్లల ఓట్లు కూడా కావాలని..జాబు కావాలని బాబు రావాలన్నారు. జాబు రాకపోతే రూ.2 వేలు నిరుద్యోగ భృతిఇస్తానన్నారు. విజయనగరం యువభేరిలో ఓ యువకుడు అడిగాడు. చంద్రబాబు నాకు రూ.64 వేలు బాకీ ఉన్నాడని, ఎవర్ని అడగాలని కోరాడు. అసత్యాల పరిపాలన ఏ స్థాయిలో జరుగుతుందంటే..హోదాను కేంద్రం ఎగురగొట్టింది. అడిగే దమ్ము, ధైర్యం బాబుకు లేదు. ప్యాకేజీ అని అసత్యాలు చెప్పారు. మనకు ఇవ్వాల్సిన దానికన్న ఎక్కువ ఇస్తే దాన్ని ప్యాకేజీ అంటారు. అలా కాకుండా మనకు ఇవ్వాల్సిందే ఇస్తే దాన్ని బాబు ప్యాకేజీ అని పేరు పెట్టాడు. నిన్న మైక్ పట్టుకొని బాబు క్లాస్ చెప్పాడు. రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు అన్నాడు. నిరుడు రూ.4 లక్షల కోట్లు పెట్టుబడులు అని బాబు బొంకాడు. మనం అందరం ఏపీలో ఉన్నాం. ఎక్కడైనా మనకు పరిశ్రమలు కనిపిస్తున్నాయా? ఎక్కడా లేవు. అయినా చంద్రబాబు మాత్రం మన చేవుల్లో క్వాలీఫ్లవర్ పెడుతున్నారు. ఇటీవల కేపీఎంజీ అనే సంస్థ ఓ సప్లిమెంటరీ ప్రవేశపెట్టింది. ఏపీలో బాబు పాలన మొదలైన తరువాత రాష్ట్రంలో 6 వేల పరిశ్రమలు ఉంటే బాబు పాలనలో 24 వేల పరిశ్రమలు మూతపడ్డాయని చెప్పారు. కారణం ఏంటంటే కరెంటు రేట్లు ముట్టుకుంటే

# చతుర్ముఖ దుష్టపరిపాలన

షాక్ కొడుతుందట. ఇవాళ చంద్రబాబు అసత్య పరిపాలన ఏ స్థాయిలో ఉందంటే..పోలవరం కుడికాల్వను వైయస్‌ఆర్ హయాంలో 140 కిలోమీటర్లు పూర్తి చేశారు. మిగింది 30 కిలోమీటర్లు..ఇంకా 20 కిలోమీటర్లు అసంపూర్తిగా ఉండగానే లష్కర్‌లాగా గేట్లు ఎత్తి నదులు అనుసందానం చేశానని బొంకుతున్నాడు. బాబు ఎవర్ని వదిలిపెట్టడం లేదు. సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు తానే కనిపెట్టానని చెబుతాడు. సత్య నాదేళ్లకు నేనే ట్యూషన్ చెప్పడంతో ఆయన మైక్రోసాఫ్ట్ సీఈవో అయ్యాడని అబద్దాలు చెప్పిందే చెప్పి నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు9. బాబు పాలనలో అసత్య పాలన అంటే ఇదే

## అప్రజాస్వామిక పాలన

ప్రజలు ఓట్లు వేసి గెలిపించిన సర్పంచ్‌లకు విలువలు లేవు. జన్మభూమి కమిటీలట. రేషన్ కార్డులు, పింఛన్లు ఇచ్చేది వాళ్లేనట. ప్రజాస్వామ్య దేశంలో ప్రజలు ఓట్లు వేసిన నాయకులకు ఎలాంటి హక్కులు లేవు. గిరిజనులకు రాజ్యంగం ప్రకారం ట్రైబ్స్ అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేయాలి. దాంట్లో సభ్యులంతా కూడా ఎమ్మెల్యేలు గిరిజన ప్రాంతాల నుంచి వచ్చిన వారే ఉండాలి. ఇవాళ వైయస్‌ఆర్‌సీపీ తరుపున ఏడుగురు ఎమ్మెల్యేలు గిరిజనులు ఉన్నారని, అందులో వారి అధికారం ఉంటుందని ఆ కమిటీ వేయడం లేదు. నియోజకవర్గ నిధులు కూడా తనకు కాని ఎమ్మెల్యేలకు నిధులు ఇవ్వకుండా ఇష్టమొచ్చిన వారికి నిధులు ఇస్తు వ్యవస్థను నాశనం చేస్తున్నాడు. గిరిజనులు, దళితులకు అసైన్డ్ భూములు ఇచ్చి అండగా నిలివాల్సింది పోయి.. ఈ భూములు తన అత్తగారి సొత్తు అన్నట్లు బాబు వాటిని ఎలా లాక్కోవాలని దిక్కుమాలిన ఆలోచనలు చేస్తున్నాడు. భూసేకరణ చట్టంలో మార్పులు తీసుకొని వస్తున్నాడు. చింతలపూడి ప్రాజెక్టు ఉదాహరణగా చెప్పవచ్చు. ఒకే ప్రాజెక్టు పరిధిలో వేరు వేరుగా పరిహారం ఇస్తున్నాడు. పెద్ద వేగిలో రూ.46 లక్షలు, బావురుపాలెంలో రూ.54 లక్షలు ఇస్తున్నాడు. పక్కనే ఉన్న పోలవరం నిర్వాసితులకు వేరే ప్యాకేజీ ఇస్తున్నారు. వేరే పార్టీలో గెలిచిన ఎమ్మెల్యేలకు డబ్బులతో ప్రలోభపెట్టి తన పార్టీలోకి లాక్కుంటున్నాడు. అలా పార్టీ మారిన వారిపై అనర్హత వేటు వేయాల్సి ఉండగా వారిని కాపాడే ప్రయత్నం చేస్తున్నాడు. వాళ్లలో రాజీనామా చేయించే మళ్లీ ఓట్లు అడిగే దమ్ము, ధైర్యం బాబుకు లేదు. ఎమ్మెల్యేలను సస్పెండ్‌చేస్తున్నాడు. మిగిలిన వారికి భయం పుట్టించేందుకు ప్రివిలేజ్‌కమిటీలో ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇలా సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్యమా? ఇవాళ చంద్రబాబు స్వయాన రాజధాని ప్రాంతంలో అక్రమ నిర్మాణాన్ని తన అధికార నివాసంగా చేసుకున్నాడు. గాంధేయపద్ధతిలో రిపబ్లిక్ డే రోజు క్యాండిల్ ర్యాలీ చేస్తే ఒప్పుకోవడం లేదు. ప్రతిపక్ష నాయకుడిని ఏయిర్‌పోర్టులోనే వెనక్కు పంపారు. ఎక్కడైనా రైల్‌రోకోలు చూశాం కాని, ఫ్లైట్ రోకో చేయించారు. పోరాటానికి ఇవాళ మేధవులు, గ్రామ స్థాయి నుంచి అందరు సన్నధం కావాలి. అందులో భాగంగా శ్రీధర్ మన పార్టీలోకి రావడం సంతోషం. శ్రీధర్‌కు తోడుగా నిలవండి. దుర్మార్గమైన పాలనను బంగాళఖాతంలో కలుపుదామని వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# వైయస్ జగన్ పోరాట ఫలితమే..

**– వైయస్‌ఆర్‌సీపీ ప.గో జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని**



**ద్వారకా తిరుమల:** వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి పోరాట ఫలితంగానే పోలవరం నిర్వాసితులకు రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల పరిహారం అందిందని పార్టీ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు ఆళ్లనాని తెలిపారు. ఆదివారం ద్వారకా తిరుమలలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన అధ్యక్ష ఉపన్యాసం చేశారు. ఆయన ఏమన్నారంటే..

ప్రత్యేక హోదా సాధించడం ద్వారా ఐదు కోట్ల మంది ఆంధ్రుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న వైయస్ జగన్‌మోహన్‌రెడ్డికి హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నాం. మీ అందరికి తెలుసు..పశ్చిమ గోదావరి జిల్లాకు ఎన్నో సేవలు అందించిన కోటగిరి విధ్యాధరరావు కుమారుడు కోటగిరి శ్రీధర్‌బాబుకు ఆహ్వానం పలుకుతున్నాం. ఈ జిల్లాకు ఎప్పుడు వైయస్ జగన్ అండగా నిలబడుతున్నారు. ప్రజల ఇబ్బందులపై ప్రభుత్వంపై పోరాటాలు చేస్తున్నారు. ఇటీవల పోలవరం ముంపు ప్రాంతాల్లో పర్యటించి నిర్వాసితులకు అన్యాయం చేస్తున్న విధానాన్ని రాష్ట్రానికి చూపించారు. యుద్ధం ప్రకటిస్తే దానికి భయపడి రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షలకు పరిహారం పెంచారంటే అది వైయస్ జగన్ ఘనతే. జిల్లాకు వచ్చిన ప్రతిసారి ఈ జిల్లా రుణం తీర్చుకుంటానని చెప్పారు. యువభేరికి వచ్చినప్పుడు మనమందరం కూడా విజయవంతం చేశాం. యువత ముందుకు వచ్చి పోరాటంలో భాగస్వామ్యమయ్యారు. తుందుర్రు ప్రాంతంలో కూడా వైయస్ జగన్ వచ్చాకే న్యాయం జరిగింది. ఆయా ప్రాంతాలకు సంభందించిన ప్రజల ఆరోగ్య సమస్యలపై పోరాటం చేశారు. మళ్లీ ఈ నాడు రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం శ్రమిస్తూ..హోదా పోరాటంలో మనల్ని చైతన్యవంతం చేసేందుకు వచ్చిన వైయస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్నాం.

# ఓట్లేసిన ప్రజలకు వెన్నుపోటు పొడుస్తావా?

**– మాజీ మంత్రి పిల్లి సుభాష్‌చంద్రబోస్**



ద్వారకా తిరుమల: చంద్రబాబును నమ్మి ఓట్లు వేస్తే పశ్చిమ గోదావరి జిల్లా ప్రజలకు వెన్నుపోటు పొడుస్తావా అంటూ మాజీ మంత్రి పిల్లి సుభాష్‌చంద్రబోస్ ప్రశ్నించారు. నాలుగు రోజుల క్రితం విశాఖపట్నంలో ప్రత్యేక హోదా కోసం ఉద్యమం చేయడానికి మన నాయకుడు వెళ్లినప్పుడు ఈ ప్రభుత్వం అడ్డుకోగలిగింది కానీ..ప్రజానీకం అండగా నిలిచారు. ఈ ఉద్యమానికి మేం మద్దతిస్తామని ఇంతమంది రావడం సంతోషకరం. గత ఎన్నికల్లో ఈ జిల్లా ప్రజలు నూటికి నూరు శాతం టీడీపీ సభ్యులను ఎన్నుకొని మద్దతు ప్రకటించారు. ఈ మూడు సంవత్సరాల్లో అగ్రపీఠం వేయాల్సిన ప్రభుత్వం కనీసం లెక్క చేయడం లేదు. పోలవరం నిర్వాసితులకు అన్యాయం చేశారు. ప్రతి గ్రామంలో కూడా రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. వారు మీకు అధికారం ఇస్తే..మీరు విస్మరిస్తారా? కోటగిరి శ్రీధర్‌ను మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నాను. ఇదే స్ఫూర్తితో ప్రజలు ఉద్యమించాలి. చంద్రబాబు మోసాలపై పోరాటం చేద్దాం. ఏ ఒక్క ఎన్నికల హామీని నెరవేర్చలేదు. ఎన్నికల మ్యానిఫెస్టోలో వెనుకబడిన కులాలకు 110 హామీలు ఇచ్చారు. ఈ హామీలు అమలు చేయడం లేదు. ఎందుకు మీ వెనుకలా వెనుకబడిన కులాలు నిలబడాలి. వాగ్ధానాలు తుంగలో తొక్కిన కారణంగా ఇంత పెద్ద ఎత్తున నిరసన తెలిపేందుకు ఈ రోజు ఈ సభకు హాజరయ్యారు.

# వైయస్ జగన్‌తో కలిసి నడవాలని నాన్న చెప్పారు

## కోటగిరి శ్రీధర్



**ద్వారకా తిరుమల:** నాన్న కోటగిరి విద్యాధరరావు నన్ను టీడీపీలో చేరవద్దని, వైయస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి నడవాలని సూచించారని కోటగిరి శ్రీధర్ పేర్కొన్నారు. ద్వారకా తిరుమల బహిరంగ సభలో ఆయన వైయస్ జగన్ సమక్షంలో వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు పార్టీ కండువా కప్పి వైయస్ జగన్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కోటగిరి శ్రీధర్ ఏమన్నారంటే..ఈ కార్యక్రమం ఈ ప్రదేశంలో పెట్టడానికి ముఖ్యకారణం నా అన్నప్రసన్నం నుంచి విద్యాభ్యాసం మొదలు అన్ని ఇక్కడి నుంచే జరిగింది. మా కుటుంబం వైయస్ జగన్ మోహన్ రెడ్డి సమక్షంలో పార్టీలోకి రావాలని నిర్ణయించారు. మా మనవి అంగీకరించి ఇక్కడికి వచ్చిన వైయస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞత. విద్యాధరరావు 1983లో ఇండిపెండెంటుగా గెలిపించారు. ఆ తరువాత ఐదు సార్లు గెలిపించారు.2005లో ఓడిపోయినా..కానీ వైయస్‌ఆర్ గెలిచారని ఆనందించారు. ఒక గొప్ప వ్యక్తి పరిపాలిస్తారని ఆనందించారు. మా నాన్నకు, వైయస్‌ఆర్‌కు గొప్ప అనుబంధం ఉండేది. ఎన్నికల్లో ఓడిపోయినా కూడా ఈ జిల్లా ప్రజల కోసం రాత్రింబవళ్లు పనిచేశారు. 2013లో కాలం చేసే ముందు నేను రాజకీయాల నుంచి ఉపసంహరించుకుంటున్నాను. నీవు ఏ పార్టీలో చేరిన అభ్యంతరం లేదు. కానీ టీడీపీలో మాత్రం చేరవద్దని ఆనాడు సూచించారు. ఆ పార్టీలో 15 సంవత్సరాలు ఉన్నా..మనది ఆ పార్టీ అన్న భావన చూపించలేకపోయారు పెద్దలు. అదే రోజు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి నడవాలని నాన్న చెప్పారు. చిన్నవయసులో వైయస్‌ఆర్‌సీపీ స్థాపించి, ప్రజల సమస్యలపై పోరాడుతున్నారని నాన్నగారే చెప్పారు. చంద్రబాబు గురించి కొంత మాట్లాడుకోవాలి. ఆయనకు జీవిత అనుభవం, రాజకీయ అనుభవం మొత్తం కూడా ప్రతి ఎన్నికల్లో మన ఓట్లు వేయించుకోవాలని, ఏ బిస్కెట్ ఎవరికి ఇవ్వాలో ఆలోచిస్తారు. ప్రజా సమస్యలపై దృష్టి పెట్టడం లేదు. ఒక ప్రతిపక్ష నాయకుడిగా పరిపాలన అంటే పూర్తి పట్టు, నాయకత్వ లక్షణాలు వైయస్‌ఆర్‌కు ఉన్నాయని, అది వైయస్ జగన్‌మోహన్‌రెడ్డికి అవి వచ్చాయి. వైయస్ జగన్ సీఎం కావడం ఖాయం. నా గురించి పూర్తిగా తెలియకపోవచ్చు. నేను నూజీవీడులో పుట్టాను, ఏలూరులో ఉంటున్నాను. నాన్నగారికి సాయం చేస్తూ మూడు ఎన్నికల్లో పనిచేశాను. పోలవరం, ఉంగుటూరు, చింతలపూడిలో పనిచేశాను. గత 12 సంవత్సరాలుగా నాకు పరిచయమైన ఏ వ్యక్తిని దూరం చేసుకోలేదు. మాములుగా మీరు చాలా మంది రాజకీయ నాయకులను చూస్తే కోపముంటుంది. నాకు ఓర్పు, సహనం ఉంది.హంగు, ఆర్భాటం లేదు. మ్యానిఫెస్టోలు చూసి మోసం పోవద్దు..ఇక నేను సిద్ధం. ఒక బలమైన నాయకుడితో కలిసి నడుస్తున్నాను. పోలవరం వైయస్‌ఆర్ పుణ్యమే. ఆ రోజు చంద్రబాబు వ్యవసాయం శుద్ధ దండగ అని చెప్పారు. ఈరోజు ఎన్నో కబుర్లు చెబుతున్నారు. మనం ఢిల్లీ నాయకుడ్ని ముక్కు పిండి పని చేయించుకోవాలి. ఆ సత్తా వైయస్ జగన్‌లో ఉంది. రాష్ట్ర విభజన జరిగినప్పుడు అందరం బాధపడ్డాం. మొదటి ముద్దాయి కింద కాంగ్రెస్‌ను నామరూపాలు లేకుండా చేశాం. రెండో ముద్దాయి టీడీపీనే. ఆ పార్టీని బంగాళఖాతంలో కలుపుదాం. ఏలూరు పార్లమెంట్‌కు రెండు సమస్యలు ఉన్నాయి. కొల్లేరు సమస్యను పరిష్కరించాలి. ప్రతి ఇంటికి తిరిగి ఉంగటూరు, కైకలూరులో పర్యటించి వైయస్ జగన్‌కు ప్రతిపాదనలు అందజేస్తాను. ఏలూరు కార్పొరేషన్ అయింది..కానీ ఈ రోజు ప్రతి వస్తువు విజయవాడకు వెళ్లాల్సి వస్తోంది. ఏలూరుకు జీవం పోయాలి. మీ అందరి తరపున వైయస్ జగన్‌ను కోరుతున్నా..మన ప్రభుత్వం వచ్చిన వెంటనే ఏలూరును అభివృద్ధి చేయాలి. నేను వైయస్ జగన్‌ను కలిసినప్పుడు శ్రీధర్ నాతో ఉండూ..అందరం కలిసి అభివృద్ధి చేద్దామన్నారు. ఆళ్లనాని, బాలరాజు, దయాల్‌నవీన్, డీఎన్ఆర్, ప్రతాప్, రామచంద్రావు ఇలా ప్రతి ఒక్కరూ నాకు సహాయపడుతున్నారు. వైయస్ జగన్ సీఎం అయ్యే వరకు కష్టపడుదాం. కోటగిరి విద్యాధరరావు, వైయస్‌ఆర్ దీవెనలు ఉన్నాయి. నన్ను వైయస్ జగన్ ఓ కుటుంబ సభ్యుడిలా స్వీకరించారు. నేను కూడా నమ్మకంగా ఉంటాను.

### 30న కృష్ణా జిల్లాలో
## వైయస్ జగన్ పర్యటన



**విజయవాడ:** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఏపీ ప్రతిపక్ష నేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఈ నెల 30న కృష్ణా జిల్లాలో పర్యటించనున్నారు. బాపులపాడు మండలంలో బొమ్మలురు, కానుమెలులో కరువు ప్రాంతాల్లో పర్యటించనున్నారని వైయస్ఆర్ సీపీ ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం వెల్లడించారు. రెండేళ్లుగా పంటలు పండని పొలాలను, తెగులుతో నష్టపోయిన మినుము పంటలను పరిశీలించిన అనంతరం అక్కడి రైతులతో వైయస్ జగన్ ముఖాముఖి కానున్నారు.

# బాబు పుట్టు పూర్వోత్తరాలు తెలుసు

- అది భాగస్వామ్య సదస్సు కాదు..గెట్ టు గెదర్
- విశాఖను తానే నిర్మించానని బాబు చెప్పుకున్న ఆశ్చర్యపోనక్కర్లేదు

వైయస్ఆర్‌సీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ విజయవాడ: ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబునాయుడు పుట్టు పూర్వోత్తరాలు తెలుసు కాబట్టే.. ఆయన సొంత జిల్లా చిత్తూరులో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 2014 ఎన్నికల్లో 8 సీట్లను గెలుచుకుందని మాజీ మంత్రి, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ అన్నారు. విజయవాడలో మీడియాతో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రెండు రోజులుగా విశాఖలో జరిగింది భాగస్వామ్య సదస్సు కాదని.. అది గెట్ టు గెదర్ లా ఉందని ఎద్దేవా చేశారు. రాబోయే రోజుల్లో విశాఖను నేనే నిర్మించానని చంద్రబాబు చెప్పుకున్న ఆశ్చర్యపోనక్కర్లేదని బొత్స అన్నారు. రూ.10.50 లక్షల కోట్లు పెట్టుబడులు వస్తున్నాయని చెబుతున్నారని, రూ.20 లక్షల కోట్లు వస్తున్నట్లు చెప్పుకుంటే బాగుండేదని ఎద్దేవాచేశారు. చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలేనని, భాగస్వామ్య సదస్సులో ఎంవోయూ చేసుకున్న కంపెనీల నెట్ వర్క్, బ్యాక్ గ్రౌండ్ క్రెడిబిలిటీని బయటపెట్టాని బొత్స డిమాండ్ చేశారు.

### ఫ్యాక్షన్ రాజకీయాలను ప్రోత్సహించింది బాబే

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఫ్యాక్షన్‌రాజకీయాలను ప్రోత్సహించింది చంద్రబాబే అని బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. హత్య, ఫ్యాక్షన్ రాజకీయాలను పోషించేదెవరో అందరికీ తెలుసునని, రాజకీయ నేత హత్యలో ఎవరున్నారో బెజవాడ ప్రజలందరికీ తెలుసునని, పింగళి వంశానికి చెందిన పాత్రికేయుడి హత్య, సీఎస్ యాక్సిడెండ్.. పింగళి నరసింహారావు ఎన్ కౌంటర్ గురించి బాబు కేబినెట్ లో పనిచేసిన హరిరామజోగయ్య పుస్తకంలో రాశారాని ఈ సందర్భంగా బొత్స గుర్తుచేశారు. చంద్రబాబు హయాంలో అన్ని రంగాలు కుంటుపడ్డాయని తెలిపారు.

### హోదా కోసం ఎందాకైనా..

ఏపీకి ప్రత్యేక హోదా కోసం ఎంత దూరమైన వెళ్తామని, ఏం జరిగినా సరే హోదా సాధించే వరకు పోరాడతామని బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. హోదా ఏ రాష్ట్రంలో లేదని చెప్పేస్తున్నారు. ఏంటి అబద్ధాలు. 11 రాష్ట్రాల్లో ఉంది. అన్ని రంగాల్లో ఇబ్బందులే. రబీ సీజన్ లో 26వేల కోట్లు రైతాంగానికి అప్పు ఇవ్వాలి. 5వేల కోట్లు ఇచ్చారు. ఖరీఫ్ లో 48వేల కోట్లు ఇవ్వాల్సి వుంటే 26వేల కోట్లు మాత్రమే ఇచ్చారు.

సాగు 14లక్షల హెక్టార్లకు 9లక్షల హెక్టార్లే సాగయింది. పోసాని కృష్ణమురళి చేపల చెరువులా బాబు కథ ఉందన్నారు. అమరావతిలో అబివృద్ధి లేదన్నారు. అంతా తాత్కాలికమే అన్నారు. చంద్రబాబు తన తరతరాలకు సరిపడా ఆస్తులు సంపాదించుకునేందుకు స్విస్ చాలెంజ్ పేరుతో దోపిడీ. సంవత్సరం పోతే అమరావతిని వదిలేసి విశాను అభివృద్ధి చేశానంటాడు. ఒక్క పరిశ్రమ కూడా తేలేదు. ప్రతీ సంక్షోభాన్ని అవకాశంగా మల్చుకోవాలంటాడు. దాన్ని అవకాశంగా మల్చుకోని దోపిడీకి పాల్పడి మొత్తం తినేస్తున్నారని ఫైర్ అయ్యారు.

# హోదా కోసం వైయస్ జగన్ పోరాటం

- బాబు, మోడీలు రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారు
- వైయస్ జగన్ హోదా కోసం ఎంతగానో పరితపిస్తున్నారు
- గల్లీ నుంచి ఢిల్లీదాక పోరాడారు
- పార్లమెంట్ లో హోదా కోసం పట్టుబడతాం
- ఎంవోయూ అంతా ఓ బూటకం
- హోదా సెంటిమెంట్ ను పక్కదారిపట్టించేందుకే..
- బాబు పెట్టుబడుల నాటకం
- వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎంపీల సమావేశం
- ప్రత్యేక హోదాయే ప్రధాన ఎజెండా

## వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు



**హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేకహోదా కోసం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఏపీ ప్రతిపక్ష నేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఎంతగానో పరితపిస్తున్నారని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు తెలిపారు. ప్రత్యేకహోదా వస్తేనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందుతుందని తెలిసి కూడా చంద్రబాబు, మోడీలు...ఇచ్చిన మాటను భంగం చేసి రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో వైయస్ జగన్ అధ్యక్షతన జరిగిన పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ఎంపీలు హాజరయ్యారు. ఏపీకి ప్రత్యేకహోదానే ప్రధాన అంశంగా చర్చించినట్టు తెలిపారు. ఈసందర్భంగా మేకపాటి రాజమోహన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ....ఏపీ అభివృద్ధి ఒక్క ప్రత్యేకహోదాతోనే సాధ్యమని, ప్యాకేజీకి విలువే లేదని అన్నారు.

హోదా వస్తేనే ఏపీ పారిశ్రామికంగా బాగా అభివృద్ధి చెందుతుందని, చదువుకున్న పిల్లలకు ఉద్యోగాలొస్తాయని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్ మెంట్ పుణ్యమాని ప్రతి పేద బిడ్డ చదువుకొని డాక్టర్లు, ఇంజినీర్లు అవుతున్నారని, హోదా లేకపోవడంతో వారంతా ఉద్యోగాల కోసం వేరే రాష్ట్రాలకు వెళ్లి వెతుక్కోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. హోదా వస్తే అందరికీ ఇక్కడే ఉద్యోగం వస్తుందన్నారు.

హోదాకు–ప్యాకేజీకి తేడా లేదంటూ కన్వీన్స్ చేసినట్టుగా మాట్లాడుతూ బాబు నవరసాలు పలికిస్తున్నారని, ఆయన భాష చూస్తుంటే ప్రజలను వంచించడం తప్ప మరొకటి లేదని ఎద్దేవా చేశారు. ఐదుకోట్ల మంది ఆంధ్రుల హక్కుల్ని బాబు, మోడీ కాలరాస్తున్నారని ఫైర్ అయ్యారు. ప్రత్యేకహోదా కోసం వైయస్ జగన్ జగన్ చేయని పోరాటం లేదని గుర్తు చేశారు. ప్రధాని, రాష్ట్రపతి, కేంద్రమంత్రులను కలిసారు. ఢిల్లీలో ధర్నా, రాష్ట్రంలో బంద్ లు, ఆమరణ నిరాహార దీక్షలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. విశాఖలో క్యాండిల్ ర్యాలీకి వెళ్లిన ప్రతిపక్ష నేతను విమానం దిగి దిగకముందే అడ్డుకొని తిరిగి వెనక్కి పంపించడం దారుణమన్నారు. వాస్తవాలు చెప్పకుండా బాబును సపోర్ట్ చేసే పత్రికలు వక్రీకరించి చెబుతున్నాయని మేకపాటి ధ్వజమెత్తారు. టీడీపీ, బీజేపీ పాలనలో ఏపీ అన్ని రకాలుగా నష్టపోయిందని, ప్రత్యేకహోదాతో పాటు విభజన చట్టంలోని హామీల కోసం పార్లమెంట్ లో గట్టిగా పోరాడుతామని చెప్పారు.

### వరప్రసాద్...

స్పెషల్ ప్యాకేజీలో ఎంత డబ్బు వచ్చింది, ఎన్ని పరిశ్రమలు వచ్చాయో చెబితే బాగుంటుంది తప్ప...హోదా కన్నా ప్యాకేజీతోనే ఎక్కువ వచ్చిందని చంద్రబాబు చెప్పడం ప్రజలను మోసం చేయడమేనని తిరుపతి ఎంపీ వరప్రసాద్ విమర్శించారు. ప్యాకేజీలో వచ్చే డబ్బులు సీఎం అకౌంట్ లోకి వెళితే చంద్రన్న కానుక, చంద్రన్న బాట అని వాళ్లు ఇష్టమొచ్చినట్లు ఉపయోగించుకుంటారు తప్ప అవి ప్రజలకు ఉపయోగపడవని స్పష్టం చేశారు. ప్యాకేజీతో అభివద్ధికి అవకాశమే లేదని స్పష్టం చేశారు. ఎంవోయూలు అంతా బూటకమని వరప్రసాద్ కొట్టిపారేశారు. 21లక్షలు ఉద్యోగాలొస్తాయని చెప్పారు. ఏ బేసిస్ మీద వస్తాయో తెలియదు. గతంలో ఇదే మాదిరి చెప్పారు. ఒక్క ఉద్యోగం కూడా రాలేదని అన్నారు. హోదాతేనే రాష్ట్రాభివద్ధి సాధ్యమని అధ్యక్షులు వైయస్ జగన్ ఆదేశిస్తే తామంతా రాజీనామాకు సిద్ధమని చెప్పారు.

### వైవీ సుబ్బారెడ్డి..

ఏపీకి జరుగుతున్న అన్యాయాన్ని గ్రహించి పక్కన తెలంగాణ రాష్ట్ర ఎంపీలు కూడా హోదాకు మద్దతు తెలుపుతున్నారని, కానీ టీడీపీ ఎంపీలకు మాత్రం జ్ఞానోదయం కావడం లేదని ఒంగోలు ఎంపీ వైవి సుబ్బారెడ్డి దుయ్యబట్టారు. తెలంగాణ వాళ్లను చూసైనా టీడీపీ ఎంపీలు పునరాలోచించుకోవాలన్నారు. ప్రత్యేకహోదా పోరాటానికి ఇప్పటికైనా తమతో కలిసి రావాలని సూచించారు. పార్లమెంట్ లో హోదా కోసం లోగడ చేసినవిధంగానే ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని చెప్పారు. రాష్ట్రపతికి ధన్యవాదాలు చెప్పే సమయంలో ఓటింగ్ పెట్టే సందర్భంగా మిగతా పార్టీలతో మాడి హోదాపై స్పష్టత ఇవ్వాలని కోరతామన్నారు. బడ్జెట్ సమావేశాల్లో ప్రైవేటు మెంబర్ బిల్లు , అదేవిధంగా యాంటీ డిఫెక్షన్ బిల్లు ప్రవేశపెడతామని చెప్పారు.

### మిథున్ రెడ్డి..

నిన్నటి విశాఖ సదస్సులో 2లక్షల కోట్లు పెట్టుబడులొచ్చాయని బాబు గొప్పలు చెప్పుకోవడం తప్ప సాధించేదేమీ లేదని రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి అన్నారు. గత సంవత్సరం కూడా 4లక్షల కోట్లు వచ్చాయని ఇదే మాదిరి చెప్పి మోసం చేశారన్నారు. ఏదైనా పరిశ్రమ పెట్టేటప్పుడు ఢిల్లీలో డీఐపీపీలో అప్లై చేస్తారని, అందులో వీళ్లు చేసింది కేవలం 30 వేల కోట్లు మాత్రమేనని చెప్పారు. గ్రౌండ్ రియాలిటీ చూస్తే 4, 5వేల కోట్ల కన్నా ఎక్కువ రాలేదన్నారు. ఎంవోయూ అంతా ఓ బోగస్ అని విమర్శించారు. హోదా సెంటిమెంట్ ను పక్కదారి పట్టించేందుకే లక్షల కోట్లు పెట్టుబడులు అంటూ నాటకాలు ఆడుతున్నారని ఫైర్ అయ్యారు.